## క్లుప్తంగా

### కుష్టువ్యాధి నిర్మూలనకు కృషిచేయాలి



నాగర్‌కర్నూల్ క్రైం: కుష్టువ్యాధి నిర్మూలనలో వైద్య సిబ్బంది ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి అన్నారు. శనివారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం నుంచి నెల వరకు ఆ రోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నారన్నారు. సర్వే కోసం 900 బృందాలను సిద్ధం చేసినట్లు, సర్వేకు వచ్చే వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. ప్రజలు తమ శరీరంపై స్పర్శ లేని తెలుపు, రాగి రంగులో మచ్చలు కనిపిస్తే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటదాస్, వైద్యులు తారాసింగ్, భీమానాయక్, ప్రోగ్రాం అధికారులు రవికుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

### బొందలపల్లిలో వైద్య శిబిరం



నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని బొందలపల్లిలో శనివారం శ్రీరామ మొబైల్ నిర్వాహకులు బండారు ఆనంద్ ప్రోత్సాహంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సందేశ్ సివిల్ అసిస్టెంట్ జనరల్ సర్జన్, డాక్టర్ హుస్నీర్ ప్రభుత్వ డాక్టర్లతో నిర్వహించిన వైద్య శిబిరంలో బీపీ, షుగర్, జలుబు, మోకాళ్ల నొప్పులు తదితర వ్యాధులను పరీక్షించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డాక్టర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు

లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు కె.ప్రణయ్, ఎ.శివ అండర్-19 విభాగంలో వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ వెంకటేశ్వర్లు తెలిపారు. త్వరలో రాష్ట్ర స్థాయి పోటీలలో ఆడనున్నారని పీడీ తెలిపారు.

**రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థి..**


పెద్దకొత్తపల్లి: ఈ నెల 28న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కబడ్డీ పోటీలలో అండర్ -14 విభాగంలో గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పెద్దకొత్తపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన మోహన్ ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. డిసెంబర్ 3 నుంచి భువనగిరిలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో మోహన్ పాల్గొంటాడని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థి అభినందించారు.

### విద్యార్థులకు నాసా కిట్లు పంపిణీ



నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని చైతన్య పాఠశాల విద్యార్థులకు శనివారం నాసా కాంటెస్ట్‌లో పాల్గొనే విద్యార్థులకు కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, బండారు ఆనంద్ పాల్గొన్నారు.

### ఉచిత విద్య, వైద్యం అందించాలి



కల్వకుర్తిరూరల్: సమాజంలోని ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్యతో పాటు వైద్యం ఉచితంగా అందించాలని డిమాండ్ చేస్తూ ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం డిప్యూటీ తహసీల్దార్ కవితకు విజ్ఞప్తి చేశారు. అందరికి న్యాయం చేసే విధంగా పాలకులు చర్యలు తీసుకోవాలని రాజు కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలి

కొల్లాపూర్: సంక్షేమ వసతిగృహాలు, గురుకులాల్లో మరణించిన విద్యార్థుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకులు డి.శేఖర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన కొల్లాపూర్‌లోని ఎస్టీ బాలుర వసతిగృహంలో భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో రవి, గణేష్, అర్జున్ ఉన్నారు.

# పదవీ విరమణ తప్పనిసరి



పదవీ విరమణ పొందిన ఈఈ శ్రీధర్‌రావును సన్మానిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

● కలెక్టర్ బాదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరని కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు. మిషన్ భగీరథ ఈఈ శ్రీధర్ రావు పదవీ విరమణ సందర్భంగా శనివారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని వెలమ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ బాదావత్ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ అధికారిగా శ్రీధర్‌రావు తనకు కేటాయించిన విధుల పట్ల నిబద్ధతో పని చేశారని, అధికారులు, డీఈలు, ఏఈలు సిబ్బందితో స్నేహ భావంగా ఉంటూ క్రమ శిక్షణతో విధులు నిర్వహించేలా పర్యవేక్షించారన్నారు. మిషన్ భగీరథ ద్వారా జిల్లాలో ఇంటింటికి తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలందించారని కలెక్టర్ తెలిపారు. ఈఈ శ్రీధర్ రావు సేవలను ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశంసించారు. అదనపు కలెక్టర్ కే సీతారామారావు మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో 34 సంవత్సరాల నుంచి అంకితభావంతో పనిచేశారని, ఉద్యోగ విరమణ అనంతరం శేష జీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. జిల్లా అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు, జిల్లా వెటర్నరీ అధికారి డాక్టర్ జీవి రమేష్, జిల్లా పంచాయతీ అధికారి రామ్మోహన్ రావు, మిషన్ భగీరథ ఈఈ సుధాకర్ సింగ్, జిల్లా క్రీడల అధికారి సీతారాం నాయక్, కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్‌లు ఈఈ శ్రీధర్‌రావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మిషన్ భగీరథ డీఈలు, ఏఈలు, సిబ్బంది, ఆయన కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### మీ సేవా కేంద్రం కోసం దరఖాస్తుల ఆహ్వానం

కొల్లాపూర్: కొల్లాపూర్‌లో నూతనంగా మీ సేవా కేంద్రం కోసం ఆసక్తి గల వారు దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు సూచించారు. దరఖాస్తుదారులు స్థానికులై ఉండాలని, డిగ్రీ లేదా సమాన విద్యార్హతలు ఉండాలని, 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగి, కంప్యూటర్, ఇంటర్నెట్ అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు దారులకు రాత, మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 7 వ తేదీలోపు దరఖాస్తు పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలన్నారు. కలెక్టర్ అండ్ చైర్మన్ ఈ-గవర్నెన్స్ సొసైటీ నాగర్‌కర్నూల్ పేరిట రూ.500 డీడీతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

### వ్యక్తిగత వివరాల సేకరణ సరైందికాదు

తాడూరు: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన సర్వేలో వ్యక్తిగత వివరాలు ఆధార్, పాస్ బుక్కు, బ్యాంక్ ఖాతా, మొబైల్ నెంబర్ సేకరించడం సరైన పద్ధతి కాదంటూ డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కిరణ్మైకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు భరత్ మాట్లాడారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు రాము, భాను, శివుడు, శ్రీకాంత్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

### వనభోజనంలో విద్యార్థులు

తాడూరు: మండలంలోని ఐతోల్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పూజారి హరికృష్ణ ఆధ్వర్యంలో శనివారం వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని రైతు తోటలో భారత మాత చిత్రపటానికి పూలమాలలు వేసి విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి వనభోజనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వీరేష్, అకిల్, రాంకిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఆత్మవిశ్వాసంతో ముందుకు పోవాలి

లింగాల: చదువులో ముందుకు వెళ్లాలంటే ఆత్మ విశ్వాసం ఎంతో అవసరమని సైకాలజిస్టు డి. శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు జ్ఞాపక శక్తి ఉన్న విద్యార్థులకు చదువుపై ఎలా దృష్టి సారించాలనే దానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ బషీర్ అహ్మద్, హెచ్ఎం కొండయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### గురుకులాల పోరుబాట

కల్వకుర్తిరూరల్: ప్రజాపాలనలో గురుకుల పాఠశాలల విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటు ప్రాణాలు కోల్పోతున్నారని భారత జాగృతి విద్యార్థి బాగ జిల్లా అధ్యక్షుడు బీఆర్‌ఎస్‌ఈ మండల అధ్యక్షుడు గణేష్ దారమోని అన్నారు. పట్టణంలోని జ్యోతిబాపూలే బాలుర బీసీ గురుకుల పాఠశాలను సందర్శించడానికి వెళ్తే గేటు వద్దే ఆపి గేటుకు తాళాలు వేసుకోవడం దారుణమన్నారు. సురేష్ గౌడ్, పర్వతాలుగౌడ్, కృష్ణ, రాజేశ్ పాల్గొన్నారు.

### దళితులతో ఆలయ ప్రవేశం



ఉప్పునుంతల: మండలంలోని మర్రిపల్లిలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అధికారులు గ్రామంలో దళితులతో ఆలయ ప్రవేశం చేయించారు. గ్రామంలో సమావేశం నిర్వహించి పౌర హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంటరాని తనం పాటిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కేశవ్, ఎమ్మార్ఐ సుజాత, ఏఎస్ఐ రెడ్యానాయక్, కానిస్టేబుల్ లింగయ్య పాల్గొన్నారు.

### కేఎల్ఐ కాల్వకు గండి

వెల్దండ: మండలంలోని భర్కత్‌పల్లి లింగమయ్య గుట్ట సమీపంలో ఉన్న కేఎల్ఐ కాల్వకు శనివారం గండిపడినట్లు కేఎల్ఐ డీఈఈ సమయ్య పేర్కొన్నారు. డి-82 కాల్వ చివరి ఆయకట్టు నాగిళ్ల వరకు సాగునీరు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని.. కాల్వలో నీటి ఉధృతి అధికం కావడంతో గండిపడినట్లు తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి యంత్రాల సాయంతో గండి పూడుస్తామని వివరించారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కుప్పగండ్లలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించిన ఇన్‌చార్జి ఎంఈఓ చంద్రుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖర్

వెల్దండ: పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు నాణ్యతగా అందించాలని ఇన్‌చార్జి ఎంఈఓ చంద్రుడు పేర్కొన్నారు. మండలంలోని కుప్పగండ్ల పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు.

**మధ్యాహ్న భోజనంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి..**

ఉప్పునుంతల: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం నిర్వాహణపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈఓ చంద్రశేఖర్ సూచించారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వంట ఎజెన్సీ మహిళలతో ఎంఈఓ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారంలో రోజుకు ఒక ఉపాధ్యాయుడు ప్రత్యేకంగా మధ్యాహ్న భోజనం విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టి అందుకు నిర్దేశించిన రిజిస్టర్‌లో సంతకం చేయాలన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, రవిశేఖర్, నర్సింహ, మల్లికార్జున్ ఆయా పాఠశాలల హెచ్ఎంలు, మహిళలు పాల్గొన్నారు.

**బీసీ హాస్టల్ ఆకస్మిక తనిఖీ**

కోడేరు: మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌ను తహసీల్దార్ విజయ్‌కుమార్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బియ్యంలో పురుగులు రాకుండా చూడాలన్నారు. కూరగాయలు నాణ్యతగా ఉండే విధంగా హాస్టల్ వార్డెన్‌కు సూచించారు.

**రాగిజావా విద్యార్థులకు అందించాలి**

లింగాల: పౌష్టికాహారమైన రాగిజావాను విద్యార్థులకు అందివ్వాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యతగా ఉండాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు.

## గాలిగోపురానికి రూ.25లక్షల విరాళం

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తరద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలోని బోగమహేశ్వరం పంచలింగాల వద్ద గాలిగోపురం మరమ్మతుల కోసం అచ్చంపేట రెడ్డిసేవా సమితి రూ.25లక్షల విరాళం ప్రకటించింది. ఆలయ చైర్మన్ బీరం మాధవరెడ్డికి శనివారం ఉమామహేశ్వరం ఆలయం వద్ద విరాళం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రెడ్డిసేవా సమితి నాయకులు రామకృష్ణారెడ్డి, డాక్టర్ గోవర్ధన్‌రెడ్డి, అడ్వకేట్ చంద్రారెడ్డి, ఎ.గోపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి, బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నా



ఉమామహేశ్వరంలో విరాళం అందజేస్తున్న రెడ్డిసేవా సమితి నాయకులు

## మాలల సింహగర్జనకు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అచ్చంపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదివారం సికింద్రాబాద్ పరెడ్ గ్రౌండ్స్‌లో మాలల సింహగర్జన సభకు భారీగా తరలి రావాలని మాల ఉద్యోగుల డివిజన్ అధ్యక్షులు ఆంజనేయులు కోరారు. అచ్చంపేట మాల మహానాడు భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మాలలు ఐక్యతతో ముందుకు పోవాలని, హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరు కలిసి రావాలని పిలుపు నిచ్చారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు నేతలు కుంద మల్లికార్జున్, పంబ నారాయణ, రవిందర్, బాలస్వామి, జనార్దన్, శ్రీను, వాస్ ,కుంద అంజి, సుధాకర్, బాబు, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు



పెంట్లవెల్లి: కార్తీక మాసం చివరి శనివారం సందర్భంగా పెంట్లవెల్లిలో ఆకుతోట అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రజలు, మహిళలు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### గుండాలలో ప్రత్యేక పూజలు



వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధికెక్కిన గుండాల దేవాలయంలో భక్తులు అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ బస్సులు సభకు పంపడంపై బీజేపీ నిరసన

కొల్లాపూర్: కొల్లాపూర్ డిపోలోని ఆర్టీసీ బస్సులన్నింటినీ మహబూబ్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన సభకు పంపడంపై బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు సాయికృష్ణగౌడ్ మాట్లాడారు. ఒక్క బస్సును కూడా ప్రజలకు అందుబాటులో ఉంచకుండా బస్సులన్నీ కాంగ్రెస్ సభకు పంపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. బస్సులు లేక విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. కాంగ్రెస్ సభకు బస్సులు పంపిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సందురమేష్, కేతూరి నారాయణ, కల్పనారెడ్డి, శివకృష్ణయాదవ్, అశోక్ తదితరులున్నారు.

### ప్రైవేట్ బస్సు చోరీకి యత్నం

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రైవేట్ బస్సును చోరీకి యత్నించిన సంఘటన జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్‌డిపో వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితుల సమాచారం మేరకు.. జిల్లా కేంద్రానికి చెందిన సంతోష్, రమేష్ ప్రైవేట్ బస్సు నిర్వహిస్తున్నారు. బస్సును ఆర్టీసీ డిపో వద్ద నిలుపగా, గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసి చారగొండ వద్దకు తీసుకెళ్లి అక్కడే వదిలేసి పరారయ్యారు. ఈ విషయం తెలుసుకున్న సంతోష్, రమేష్ శనివారం ఉదయం చారకొండ వద్దకు వెళ్లి బస్సును స్వాధీనం చేసుకుని జిల్లా కేంద్రానికి తీసుకొచ్చారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తిమ్మాజిపేట: మండలంలోని గుమ్మకొండ సమీపంలో పెట్రోల్ బంకు వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలు కాగా, ఐదుగురు విద్యార్థులకు త్రుటిలో తప్పించుకున్న సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. తిమ్మాజిపేట నుంచి రాంరెడ్డిపల్లికి వెళ్తున్న కారులో ఇద్దరు వ్యక్తులు, గుమ్మకొండకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఉన్నారు. పెట్రోల్ బంకు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్‌టీసీ బస్సును తప్పించబోయి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న చందుబట్ల వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. విద్యార్థులకు ప్రమాదం కాకుండా బయటపడ్డారు.

### విద్యుదాఘాతంతో కాడెద్దు మృత్యువాత

వెల్దండ: మండలంలోని అజిలాపూర్‌లో మల్లేష్‌గౌడుకు చెందిన కాడెద్దు విద్యుదాఘాతంతో శనివారం మృత్యువాత పడింది. బాధితుడి వివరాల ప్రకారం.. వ్యవసాయ పొలంలో మేత మేస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై మృత్యువాత పడింది. బాధితుడిని మాజీ సర్పంచ్ కాలే లక్ష్మమ్మ, గ్రామస్తులు పరామర్శించారు.

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



కల్వకుర్తి టౌన్: హాస్టల్ విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ అన్నారు. శనివారం పట్టణంలోని కస్తూర్బా పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహాలను, మరుగుదొడ్లు, వంటగది, డైనింగ్ పరిసరాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ రమాదేవి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ శివ, పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఉన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని బాలరాం నగర్‌కు చెందిన నార్లకంటి శేఖర్ ఇటీవల మృతి చెందారు. శ శనివారం మిత్రఫౌండేషన్ సభ్యులు బాధిత కుటుంబానికి 5వేల ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబానికి సహకారం అందిస్తామని మిత్ర ఫౌండేషన్ అధ్యక్షులు నాగరాజుగౌడ్, మాజీ అధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మిత్ర ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### కాంట్రాక్టర్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వెల్దండ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో కాంట్రాక్టర్ ఉద్యోగులు నల్లాబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం కాంట్రాక్టర్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని గతంలో హామీ ఇచ్చి, నేటికీ అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో బాలయ్య, ఆంజనేయులు, పెంటయ్య, చంద్రశేఖర్, కస్తూర్బా సిబ్బంది ఉన్నారు.

## పాఠశాలల బంద్ విజయవంతం



నాగర్‌కర్నూల్ అంబేద్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, విద్యార్థులు

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ ఆరోపించారు. శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఫుడ్ పాయిజన్ వల్ల ఆత్మహత్యలు సంచలనం రేపుతున్నాయని, వాటిపై ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల తాము నిరసన వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యా వ్యవస్థ గాడిలో పడేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

● పెద్దకొత్తపల్లి కేజీవీబీ ఆశ్రమ పాఠశాలలో, హాస్టల్‌లలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో బంద్ విజయవంతమైంది. చంద్రకల్, పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలను మూసివేయించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కేశవకృష్ణ, నాయకులు శ్రీనివాసులు, కేశవులు పాల్గొన్నారు.

● పెంట్లవెల్లి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ఎస్ఎఫ్ఐ కొల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు తరుణ్ ఆధ్వర్యంలో బంద్ విజయవంతంగా నిర్వహించారు. కార్యక్రమంలో మంజునాథ్, శివ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

● కొల్లాపూర్ పట్టణంలోని విద్యాసంస్థల బంద్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివవర్మ మాట్లాడారు. కార్యక్రమంలో శివకుమార్, కార్తీక్ తదితరులున్నారు.

● వెల్దండ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలను పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. తరగతులను బహిష్కరించి పాఠశాలలను మూసివేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సంతోష్, మధు, మల్లేష్ ఉన్నారు.

● కల్వకుర్తి ప్రభుత్వ పాఠశాలల్లో బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు జమాలుద్దీన్, రావూఫ్, రహెమాన్ పాల్గొన్నారు.

● తెలకపల్లి మండల కేంద్రం, గౌరెడ్డిపల్లి, ఆలేరు తదితర పాఠశాలల తరగతులు బహిష్కరించారు. అనంతరం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు దేశమోని ఆంజనేయులు మాట్లాడారు. గురుకుల సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పల్లవి, శ్రీకాంత్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సభకు తరలిన నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: కల్వకుర్తి మండలంలోని కుర్మిద్దతో పాటు మార్చాల, రఘుపతిపేట, పంజుగూల, తాండ్ర, తోటపల్లి గ్రామాల రైతులు సీఎం రేవంత్‌రెడ్డి 'రైతు పండుగ' సభకు వాహనాల్లో తరలి వెళ్లారు.

■ కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి బస్సులు, వాహనాలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు.

■ వెల్దండలో సీఎం సభకు వెళ్తున్న రైతుల బస్సులను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పార్టీ జెండా ఊపి ప్రారంభించారు.

■ పెంట్లవెల్లి, మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్ గ్రామాల కార్యకర్తలు, రైతులు తరలివెళ్లారు.

■ బిజినేపల్లి నుంచి ప్రజా విజయోత్సవ సభకు ఆయా గ్రామాల ప్రజలు బస్సుల్లో తరలివెళ్లారు.

■ పెద్దకొత్తపల్లి నుంచి రైతులు ఏఈఓ ముజీబ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులో భారీగా తరలి వెళ్లారు.

■ తెలకపల్లితో పాటు అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు, అధికారులు సభకు తరలివెళ్లారు.

■ తాడూరు మండల కేంద్రం, గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు, మహిళా సంఘాల సభ్యులు తరలి వెళ్లారు.

■ తిమ్మాజిపేట మండలంలోని ఆయా గ్రామాల నుంచి రైతులు, మహిళలు తరలి వెళ్లారు.

■ కోడేరు, రాజాపూర్, నర్సాయిపల్లి, తదితర గ్రామాల నుంచి సీఎం సభకు తరలి వెళ్లారు.

■ చారకొండ మండలంలోని కాంగ్రెస్ నాయకులు, రైతులు, అధికారులు బస్సుల్లో తరలి వెళ్లారు.

■ లింగాల మండలం నుంచి భారీ సంఖ్యలో రైతులు, మహిళా సంఘాల సభ్యులు తరలివెళ్లారు.

■ అమ్రాబాద్, పదర మండలాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు తరలివెళ్లారు.



కల్వకుర్తి పట్టణంలోని క్యాంపు కార్యాలయం వద్ద జెండాఊపి వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు



పెద్దకొత్తపల్లి నుంచి..



లింగాల నుంచి..



రాజాపూర్ నుంచి..